నవతెలంగాణ
నమ్మకమైన తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

గడ్డి మందు తాగి యువకుని ఆత్మహత్య



నవతెలంగాణ-మందమర్రి

అంగడి బజార్‌కి చెందిన కోయల్కర్ భరత్(28) గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోయల్కర్ భరత్ శనివారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాలలోని ప్రయివేట్ హాస్పిటల్‌కి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు వెల్లడించారు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు బిటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం పలుమార్లు ఇంటర్వ్యూ వరకెళ్లి ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సంఘటనపై మృతుని బాబాయి కోయల్కర్ మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వసాధారణం

నవతెలంగాణ-నార్నూర్

ఉద్యోగికి ఉద్యోగ విరమణ సర్వ సాధారణమని డీఈ సురేష్ నాయక్, సేవాలాల్ ఎంప్లాయిస్ గ్రామ యూనియన్ నాయకులు చౌహాన్ కిషోర్ అన్నారు. మండలంలోని దేవాపటార్ గ్రామంలో ఉపాధ్యాయుడిగా సేవలు అందించి, ఉద్యోగ విరమణ పొందిన రాథోడ్ మాన్ సింగ్‌కు ఆదివారం తాడిహత్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా దంపతులకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 37 సంవత్సరాలుగా, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, ఉన్నత శిఖరాలకు చేర్పించారన్నారు. సన్మాన కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జాదవ్ పరశురామ్, రాథోడ్ గణేష్, జాదవ్ ఆనంద్ రావ్, జాదవ్ గణేష్, చౌహాన్ మునిరాం, చౌహాన్ రామారావ్, రాథోడ్ రవీందర్, జాదవ్ సంతోష్, చౌహాన్ దిలీప్ ఉన్నారు.

ఆ రోడ్డు.. ఓ నరకం..!

- 60కిలో మీటర్ల పరిధిలో అడుగుకో గుంత
- ప్రమాదకరంగా ఉట్నూర్- ఆసిఫాబాద్ రహదారి
- మంజూరైనా..నిధులు విడుదలలో తీవ్ర జాప్యం
- బిల్లులు రాక పనులు నిలిపేసిన గుత్తేదారులు
- ప్రయాణికులకు నిత్యం తప్పని అవస్థలు

ఆ రోడ్డు గుండా ప్రయాణం అంటే ముందుగానే గుండెల్లో గుబులు రేపుతుంది. ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన కలుగుతుంది. పూర్తిగా గుంతలమయమైన రోడ్డు..ఒడిదొడుకులతో బస్సులు, ఇతర వాహనాలు కుదుపులకు గురవుతుండటంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఉట్నూర్ - నుంచి ఆసిఫాబాద్ వరకు ఉన్న రహదారి ప్రయాణికులకు నిత్య నరకాన్ని తలపిస్తోంది. ఉట్నూర్ ఎక్స్‌రోడ్ నుంచి ఆసిఫాబాద్ వరకు సుమారు 60 కిలో మీటర్ల రోడ్డు దుర్భేద్యంగా మారింది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి నిత్యం వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నడుము, వెన్ను నొప్పులతో ఆస్పత్రుల పాలు కావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేండ్ల క్రితమే ఈ రోడ్డు మంజూరైనా నిధులు విడుదలతో జాప్యం కారణంగా పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. బిల్లులు రావడం లేదనే కారణంగా గుత్తేదారులు పనులు నిలిపివేసినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.







నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తుంటారు. ముఖ్యంగా జిల్లాల విభజన తర్వాత ఇప్పటికీ కొన్ని శాఖల అధికారులు, సిబ్బంది రోజూ ఆదిలాబాద్, ఉట్నూర్, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగులే కాకుండా వేలాది మంది ప్రయాణికులు వివిధ పనులు నిత్యం ఈ రోడ్డు గుండా వెళ్తుంటారు. ఉట్నూర్ ఎక్స్ రోడ్ నుంచి నార్నూర్ ఎక్స్‌రోడ్, జైనూర్, కెరమెరి గుండా ఆసిఫాబాద్ వరకు వెళుతుంటారు. ఎక్స్ రోడ్ నుంచి ఆసిఫాబాద్ వరకు 60కిలో మీటర్ల రోడ్డు ఉండగా.. ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఉట్నూర్ ఎక్స్‌రోడ్ నుంచి హస్నాపూర్ గ్రామం చివరి వరకు ఉండగా.. కుమురంభీం జిల్లా పరిధిలో మాత్రం జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు 50కిలోమీటర్ల పరిధి ఉంటుంది. ఏండ్ల క్రితం నిర్మించిన ఈరోడ్డుకు మరమ్మతులు చేయించకపోవడంతో అనేక చోట్ల మోకాళ్లలోతు గుంతలు పడటం.. కొన్ని చోట్ల కంకరతేలి ఉండటం.. ఇంకొన్ని చోట్ల కుంగిపోయి ఒడిదొడుకులుగా ఉండటంతో ప్రమాదకరంగా మారింది. మరోవైపు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ సైతం ఆదిలాబాద్‌లో రెండు నెలల క్రితం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలోనూ ఈ రోడ్డు విషయం ప్రస్తావించారు. రోడ్డు మంజూరు చేసి ప్రయాణికుల ఇబ్బందులు దూరం చేయాలని సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు

పెందూర్ మోతీరాం, మాజీ ఎంపీపీ, కెరమెరి



ఉట్నూర్- ఆసిఫాబాద్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉండటంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కెరమెరి నుంచి ఉట్నూర్ వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఉంది. అడుగడుగునా పెద్ద గుంతలు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు రాత్రి పూట ప్రమాదాలకు గురవుతున్నారు. మరమ్మతుల కోసం అక్కడక్కడ బీటీని తొలగించినప్పటికీ పనులు చేపట్టడం లేదు. ప్రభుత్వం స్పందించి ఈ రహదారిని బాగు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలి.

బిల్లులు రాక నిలిచిపోయిన పనులు

ఉట్నూర్ నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం వరకు 60కిలో మీటర్ల పరిధి ఉన్న ఈ రోడ్డును నూతనంగా నిర్మించేందుకు రెండేండ్ల క్రితమే మంజూరుచేసింది. విడతల వారీగా నిర్మించేందుకు బిట్ల వారీగా పనులను మంజూరుచేయడంతో పలువురు గుత్తేదారులు పనులు దక్కించుకున్నారు. ఆర్నెళ్ల క్రితం అక్కడక్కడ రోడ్డు పనులను ప్రారంభించిన గుత్తేదారులు నిధులు సకాలంలో విడుదల కాకపోవడం.. బిల్లులు రావడం లేదనే కారణంగా పనులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు రోజూ నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనాలు కుదుపులకు గురికావడం.. గుంతల కారణంగా అనేక ప్రమాదాలు సంభవించేందుకు ఆస్కారం ఏర్పడింది. ఇప్పటికే అనేక మంది ఈ ప్రమాదాల బారినపడినట్లు స్థానికులు చెబుతున్నారు. మరోపక్క గర్భిణీలు, వృద్ధులు ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇక ఆదిలాబాద్, కుమురంభీం జిల్లాల పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది నిత్యం అవస్థలు పడుతూ గత్యంతరం లేని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలా అవస్థలు పడుతున్నాం

ఆత్రం బాదిరావు, ఆటో డ్రైవర్, జాండ



ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే చాలా అవస్థలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా కొత్త ఆటోలు కూడా కొన్ని రోజులకే మరమ్మతులకు గురవుతున్నాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించి త్వరగా నిర్మాణం పూర్తిచేసిన ప్రయాణ బాధలను దూరం చేయాలి.

బిల్లులు రాకపోవడంతోనే జాప్యం

పెద్దన్న, ఆర్‌అండ్‌బీ ఈఈ, ఆసిఫాబాద్

ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం ఇప్పటికే మంజూరుచేసింది. మంజూరైన చోట్ల పనులు ప్రారంభించాం. కానీ బిల్లులు సకాలంలో రావడం లేదనే కారణంగా గుత్తేదారులు పనులు నిలిపివేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

- తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి



నవతెలంగాణ-బోథ్

నాణ్యమైన విత్తనాలను అన్ని ఆగ్రో సెంటర్‌లలో అందుబాటులో ఉంచాలనీ తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక ఆగ్రోస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ఆగ్రో సెంటర్‌లలో నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. ప్రయివేటు విత్తన కంపెనీల ఉచ్చులో పడి మోసపోకుండా ఉండాలని అన్నారు. తెలంగాణ సీడ్స్ విత్తనాల అమ్మకం గురించి ఆరా తీశారు, అలాగే రైతులతో మాట్లాడుతూ తెలంగాణ విత్తనాలు అభివృద్ధి సంస్థకు విత్తనాల కోసం సాధారణ అమ్మకం సంబంధించి మధ్య దళారుల నమ్మకుండా ప్రత్యక్షంగా రైతులతోనే ఒప్పందం చేసుకొని, రైతులను లాభసాటిగా మార్చేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులను గ్రామాలకు పంపి రైతులకు మరింత అవగాహన కల్పిస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, తెలంగాణ సీడ్స్ రీజియస్ మేనేజర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, గొల్ల రాజు, బత్తుల రమేష్, శాకీర్, పాల్గొన్నారు.

అందుబాటులో అద్దెకు ఆర్టీసీ బస్సులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని, గమ్యాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకోవచ్చని, కార్తిక మాసం పురస్కరించుకొని విహారయాత్రలు, వివాహాది శుభకార్యాలకు అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం డిపో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం సురక్షితం కాదని సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో ఎంతో అనుభవం కలిగిన డ్రైవర్లు తరచు వాహనాలను ఎలాంటి ప్రమాదాల గురికాకుండా తిప్పుతారన్నారు. ఎలాంటి సందర్భంలోనైనా ప్రయివేట్ వాహనాలను కాకుండా ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకువెళ్లచ్చని కోరారు. అందరికీ అనుగుణంగా సరసమైన ధరలకు సంస్థ నిర్ణయించిన రేట్లకే బస్సులను అద్దెకి ఇవ్వడం జరుగుతుందన్నారు. డిపో పరిదిలోని ప్రయాణికులు ఈ సదావకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ 9959226006, 9441596246, 9440464035లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఐకేపీ వీఓఏల ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఐకేపీ వీఓఏల సమస్యలు పరిష్కరించాలని సోమవారం మండల సమాఖ్య కార్యాలయం ఎదుట, 11, 12 తేదిల్లో 48 గంటల పాటు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. ఆదివారం ఐకేపీ వీఓఏల జిల్లా కమిటీ సమావేశం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని, పెరుగుతున్నటువంటి ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.20,000 ఇవ్వాలని, పీఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రతతో పాటు సేర్ప్ నుండి ఐడీ కార్డ్ ఇవ్వాలని కోరుతూ నిర్వహించే ధర్నాలో జిల్లాలోని ఐకేపీ వీఓఏలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా బుద్దు, జిల్లా కార్యదర్శిగా రోజా, జిల్లా కోశాధికారి ధనరాజ్‌లను ఎనుకున్నట్టు ఆయన తెలిపారు.

పరీక్షలకు సిద్ధం కావాలి

నవతెలంగాణ-బేల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల చివరి వారం లేదా డిసెంబరు మొదటి వారంలో ఉండే అవకాశం ఉందని, విద్యార్థులు శ్రద్ధగా పరీక్షలకు సన్నద్ధం కావాలని కీర్తన డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డా వరప్రసాద్ రావు పరీక్షల వింగ్ ఇన్‌చార్జి సాగర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎప్పటి సెమిస్టర్ పరీక్షలు అప్పుడే పాస్ కావాలని అధిక సబ్జెక్టులలో ఫెయిల్ అయితే డిటైన్ అవడం వలన విద్యా సంవత్సరం కోల్పోవడంతో పాటు యూనివర్సిటీ వెళ్లి రీ అడ్మిషన్ తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే 4 సంవత్సరాల పాటు ఫెయిల్ అయితే టైం ఫ్రేమ్ కిందకు రావడం వలన వేలాది రూపాయలు యూనివర్సిటీకి ఫీ చెల్లింపు చేయాలని తెలిపారు. ఇవి అన్ని కాకుండా ఇప్పటి నుంచి పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల నూతనంగా ఏర్పడిన మండలమని అక్కడ ప్రభుత్వ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రుక్మాన్‌సింగ్, బీఆర్ఎస్ మండల నాయకుడు తుల హరీశ్ అన్నారు. ఆదివారం సొనాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నూతన మండలం ఏర్పాటుకు విడుదల చేసిన రాజముద్ర పత్రాన్ని విడుదల చేశారు. సొనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మండలంగా ఏర్పాటు చేసిన విషయం మనందరికి తెలిసిందేనని అన్నారు. గెజిట్ విడుదలయ్యి సంవత్సర కాలం దాటినా కూడా కాంగ్రెస్ నాయకులు కార్యాలయాలు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్‌లో గ్రూప్ రాజకీయాలతో సొనాల అభివృద్ధి అడ్డుపడటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, వెంటనే సొనాల మండలంలోని కార్యాలయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అభిలాష్, నరేందర్, సాయి, ఉదయ్, చిన్నయ్య సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో తనదైన ముద్ర వేసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ఓ ఉద్యోగి తన జీవితంలో నిబద్ధత, నిస్వార్థంతో పని చేస్తే, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎంపీ నగేష్ అన్నారు. ఆదివారం మండలంలోని పెర్కగూడా గ్రామంలోని జేసీస్ ఫంక్షన్ హాలులో ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావ్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భీంరావ్ నాయక్ పేద కుటుంబంలో జన్మించి, అంచలంచెలుగా ఎదుగుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. వారు ఈ ప్రాంతానికి 39 సంవత్సరాల పాటు అందించిన సేవలు మరువలేనివన్నారు. అధికారులు తమ సర్వీసులో నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తే, ప్రజలు వారి సేవలను సదా గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఉట్నూర్‌లోనీ పీఎమ్మార్సీ భవనం, ఇంద్రవెల్లి అమరుల స్తూపం, కేస్లాపూర్ ఆలయాభివృద్ధి పనుల విషయంలో కీలకంగా వ్యవహరించారని, భవిష్యత్తులో వారి సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. భీమ్‌రావు నాయక్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం పెట్టే ఉద్దేశం ఏమిటంటే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఒక చిన్న పార్టీ రూపంలో ఏర్పాటు చేశానని, అందరూ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. పదవులో ఉన్న ప్రతి ఒక్కరు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావాత్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, రేఖానాయక్, మాజీ జెడ్పీచైర్మెన్ జనార్దన్ రాథోడ్, మెస్రం మనోహర్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

సర్వేకు మధ్యాహ్నం అనుకూలమైన సమయం కాదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన సర్వేను పాఠశాల అనంతరం మధ్యాహ్నం ఉపాధ్యాయులతో చేయించడం సరికాదని, సర్వేకు మధ్యాహ్న సమయం అనుకూలం కూడా కాదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైద్య శాంతి కుమారి, సోయం ఇందు రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాలతో డిప్యూటీ సీఎం నిర్వహించిన సమావేశంలో చెప్పిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా విద్యాశాఖ ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. బోధనాభ్యసన ప్రక్రియకు ఆటంకం కలగకుండా చూడాలని కోరిన పట్టించుకోకుండా ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మాత్రమే డ్యూటీ వేసి ఒకపూట బడి నడిపి మధ్యాహ్నం సర్వే చేయాలనటం ఏమాత్రం ఆచరణ సాధ్యంకాదన్నారు. ముమ్మరమైన వ్యవసాయ పనుల రోజుల్లో పిల్లలను మధ్యాహ్నమే ఇంటికి పంపడాన్ని తల్లిదండ్రులు అంగీకరించారని, మధ్యాహ్నం సర్వేకు అనుకూలమైన సమయం కూడా కాదన్నారు. ఆసమయంలో కుటుంబ యజమానులు ఎవరూ ఇంటివద్ద ఉండరని, సెలవు రోజుల్లో సర్వే చేయవచ్చని సూచించారు. ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో సహా ఎక్కువ మందికి డ్యూటీ వేసి తక్కువ ఇళ్లను కేటాయించవచ్చని, కొందరు ఉదయం, మరికొందరు మధ్యాహ్నం వంతులవారీగా (ఆల్టర్నేటివ్‌గా) సర్వేకు హాజరయ్యేలా చూడటం సమంజసంగా ఉంటుందని సలహా ఇచ్చారు. నూతన ఉపాధ్యాయుల నియామకంతో ఇప్పుడిప్పుడే పాఠశాలలు కాస్త గాడిలో పడుతున్నాయనుకుంటున్న సమయంలో ప్రాథమిక పాఠశాలలు మూడు వారాల పాటు ఒక్క పూటే నిర్వహించాలని ఆదేశించటం వాటికి శరాఘాతంలాంటిదన్నారు. అక్టోబర్ 30న ఉపముఖ్యమంత్రితో ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కులగణన సర్వేను పాఠశాలలకు అంతరాయం కలగకుండా నిర్వహించేలా విద్యాశాఖ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పద్మశాలి సేవ సంఘం పట్టణ కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు అనుమండ్ల శ్రీకాంత్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ ఆలయం వద్ద సంఘ నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6న గుండి రోడ్డులోని పద్మశాలి సేవా సంఘం భవనంలో ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పట్టణంలోని పద్మశాలీలు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కోమటిపల్లి లింగయ్య, ప్రధాన కార్యదర్శి అల్లె శ్రీకాంత్, కోశాధికారి సంజీవ్, చిప్ప సురేష్, చెన్నూరి ప్రకాష్, భోగ మధుకర్, రమేష్, తిరుపతి, శ్రీనివాస్, ప్రణయ్, మోహన్, సంతోష్, చిన్న, నారాయణ, రవి, వనం మధుకర్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి

- నివాళులర్పించిన ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు



నవతెలంగాణ-కెరమెరి

జిల్లాలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ శంకర్ సిర్పూర్-టి మండలంలోని వెంపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. మృతదేహాన్ని స్వగ్రామమైన కెరమెరి మండలంలోని దేవాపూర్ గ్రామానికి తరలించారు. అనంతరం ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు రాథోడ్ శంకర్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లవేళలా తోడు ఉంటుందని భరోసానిచ్చారు. పోలీస్ శాఖ నుండి అందాల్సిన ఆర్థిక సాహాయన్ని అందజేస్తామని తెలిపారు. ఎస్పీ వెంట ఆర్ఐ(అడ్మిన్) పెద్దన్న, వాంకిడి సీఐ సత్యనారాయణ, ఆర్ఎస్ఐ లవన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కౌటాల మండలం ముత్తంపేట్ గ్రామానికి చెందిన పలువురికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. మొత్తం నలుగురికి మంజూరైన రూ.1,01,000ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌటాల మండల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పాఠశాల క్రీడా సామఖ్య(ఎజీఎఫ్) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆసిఫాబాద్ లోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన అండర్-19 నెట్ బాల్, బాస్కెట్ బాల్ పోటీల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీఈసీ విద్యార్థి కె కృష్ణ, అండర్-19 ఖోఖో పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థి పి ప్రశాంత్, ఖోఖో బాలికల అండర్-19 విభాగంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థి ఎస్ శిరీషలు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతినగర్ కాలనీవాసీ ఐటీడీఏ హాస్టల్‌లో డైలీ వైజ్ వర్కర్‌గా విధులు నిర్వహించిన సెడ్మకి రాజు ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం వారి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులు పరామర్శించారు. ముందుగా రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



ఉషూ క్రీడల్లో మండలవాసికి గోల్డ్ మెడల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని లాండసాంగ్వి గ్రామానికి చెందిన లింగన్న నవీన దంపతుల కుమారుడు సీహెచ్ విప్లవ్ ఉషూ అండర్-19 రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. గత మూడు రోజుల పాటు మహబూబాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో విప్లవ్ పాల్గొననున్నట్టు పీడీ శ్రీనివాస్ తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామస్తులు, బంధువులు, తోటి క్రీడాకారులు అభినందనలు తెలిపారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థిని, విద్యార్థులు, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలియజేశారు.



సమస్యలను నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్తా

- కాంగ్రెస్‌లో చేరిన లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎవరూ అధైర్యపడొద్దని.. అండగా తానుంటానని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం రాంపూర్ రోడ్‌లోని లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కంది శ్రీనివాసరెడ్డి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గతంలో పెంచిన టాక్స్‌ల కారణంగా తీవ్రంగా నష్టాలు చవిచూశామన్నారు. ట్రాన్స్‌పోర్టు వ్యవస్థను ఆదుకోవాలని కోరారు. అనేక సమస్యలు ఉన్నాయని, రవాణా రంగానికి, తమ కుటుంబాలకు అండగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. తనవంతు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషా, కోశాధికారి భోపాల్, రాష్ట్ర కార్యదర్శి సుధాకర్‌గౌడ్, ఆదిలాబాద్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అక్బర్, కోశాధికారి సదర్ అలీ ఖాన్, ఉమ్మడి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, సభ్యులతో పాటు మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉన్నారు.

ఆయా రంగాల్లో రెడ్డి బిడ్డలు రాణించడం సంతోషకరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆయా రంగాల్లో రెడ్డి బిడ్డలు రాణించడం సంతోషకరమైన విషయమని రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి అన్నారు. ఇటీవల ప్రభుత్వ కొలువులు సాధించిన రెడ్డి కులస్తులకు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూహౌజింగ్ బోర్డులోని సంఘ భవనం వద్ద ఉద్యోగాలు సాధించిన వారిని సత్కరించి అభినందనలు తెలిపారు. దీనికి కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డిలు హాజరై ఉద్యోగాలు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రతిఒక్కరూ లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా ముందుకుసాగితే తప్పకుండా విజయం వరిస్తుందని అన్నారు. ఇలాగే ఇంకా మంచి స్థాయికి ఎదిగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండాలన్నారు. గతంలో రెడ్డిలకు వందల ఎకరాలు భూములు ఉండేవని, కానీ కాలక్రమేనా పరిస్థితులు మారాయన్నారు. అందువల్ల చదువుతోనే తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. వ్యాపార రంగాల్లోనూ రాణించి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు రాజారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, కిష్టారెడ్డి, దేవేందర్ రెడ్డి, నాగారెడ్డి, భూమారెడ్డి పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్ష,కార్యదర్శులుగా శ్రీకాంత్, జలందర్ రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పదవీకాలం ముగిసింది. ఈ నేపథ్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో జరిగిన టీయూటీఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ లచ్చిరాం, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుజాత ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్ గౌరవాధ్యక్షులుగా జాదవ్ బలరాం, అధ్యక్షులుగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా జలంధర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అంజనాదేవి, ప్రఫుల్ చందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు నూతన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తామని పేర్కొన్నారు. బాధితుల పక్షాన ఎల్లప్పుడూ టీయూటీఎఫ్ ఉంటుందని అన్నారు. నమ్మకంతో తమని ఎన్నుకున్న సభ్యులకు ఎల్లప్పుడు కృతజ్ఞులమై ఉంటామని స్పష్టం చేశారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల విడుదల

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్రంలోని అతి పురాతనమైన దేవస్థానం శ్రీ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల వేడుకల కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మండల నాయకులు అడ్డి రుకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు.



28న సీఐటీయూ జిల్లా కార్యాలయం ప్రారంభం

- ప్రారంభోత్సవం జయప్రదం చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక పోరాటాల సారథి ఐక్య ఉద్యమాల వారధి సెంటర్ ఆఫ్ ఇండియన్స్ ట్రేడ్ యూనియన్స్ సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం నవంబర్ 28న ప్రారంభించనున్నట్టు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ తెలిపారు. జిల్లా కార్మికవర్గం ఉద్యోగులు ప్రజానీకం, రైతాంగం అధిక సంఖ్యలో ప్రారంభ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవంబర్ 28న జిల్లా కేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయం బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రాన్ని మాజీ పార్లమెంటు సభ్యులు అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన బృందా కరత్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించనున్నట్లు తెలిపారు. అతిథులుగా సీఐటీయూ అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు, ఆదివాసీ హక్కుల చట్టం రూపకర్త మాజీ పార్లమెంటు సభ్యులు మీడియం బాబురావు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పి.జయలక్ష్మి, కూరపాటి రమేష్, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్ హాజరవుతారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు, కార్మిక కర్షక హక్కుల సాధనకై పోరాటాలను నిర్మించేందుకు, భవిష్యత్తు ఉద్యమాల రూపకల్పనకు బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం వేదిక కానుందని అన్నారు. జిల్లాలోని కార్మికవర్గం కార్మిక ఉద్యమ శ్రేయోభిలాషులు అక్కున చేర్చుకుని నిర్మాణానికి సహకరించారని అన్నారు. బాశెట్టి మాధవరావు చివరి వరకు కష్టజీవుల పక్షాన నిలబడి పోరాడారు. జిల్లాలో సీఐటీయూని ప్రారంభించి సంఘాలు పెట్టి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తికి గుర్తుగా ఆశయ సాధనకై పోరాటాలకు వేదికగా కార్యాలయం ఉంటుందని ప్రారంభోత్సవ సభకు జిల్లా కార్మిక వర్గం ప్రజానీకం అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కే.సునీత, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, గంగన్న, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శులు డి.వెంకటమ్మ, ఎస్.నవీన్ కుమార్, జితేందర్ నాయకులు పొచ్చన్న, జితేందర్, సునీత, ముక్త రమేష్, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలను అందిస్తాం

- తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి



నవతెలంగాణ-తాంసి

తెలంగాణ రైతులకు అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలని అందించే విధంగా కృషి చేస్తానని తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ చైర్మెన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జామిడి గ్రామంలో రైతులతో కలిసి ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులు వ్యవసాయంలో పడుతున్న కష్టాలు సాధకబాధకాలను చైర్మెన్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి విత్తనాలు సరఫరా చేయాలో ఆ వివరాలను తెలుసుకున్నారు. పంట ఉత్పత్తులను అమ్ముకునే సమయంలో పడుకున్న కష్టాలను వివరించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కాలానికి అనుకూలంగా ఉండే విత్తనాలను సరఫరా చేయాలని ఉద్దేశంతో ఉందన్నారు. తెలంగాణ విత్తన ఉత్పత్తి కేంద్రాలలో శాస్త్రవేత్తల సూచనల అనుగుణంగా రైతులకు విత్తనాలను సరఫరా చేయడం జరుగుతుందన్నారు. మన తెలంగాణ పత్తి విత్తనాలను ప్రతి రైతు వినియోగించుకోవాలన్నారు. మొక్కజొన్న లాంటి అనేక రకాల విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రతి రైతు తక్కువ రోజుల్లో పంటలు చేతికి అందాలనే ఉద్దేశంతో ఉంటారన్నారు. రైతులు పండించిన పంటలను ఎప్పటికప్పుడు విక్రయించుకోకుండా మార్కెట్‌లో డిమాండ్ ధర ఉన్నప్పుడు అమ్ముకుంటే రైతుకు లాభసాటిగా ఉంటుందన్నారు. పంటల నిల్వల కోసం ప్రభుత్వం గోదాములను నిర్మించే కార్యక్రమాలు చేపట్టడానికి శ్రద్ధ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, రైతులు వినోద్‌రెడ్డి, కొడల సంతోష్, నారాయణ, కేశవరెడ్డి, భూమారెడ్డి పలువురు రైతులు ఉన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకోవడం అదృష్టంగా భావించాలి

- ఎమ్మెల్యే పాయల శంకర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమ సమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉంటుందని, అలాంటి వృత్తిని ఎంచుకోవడం అదృష్టంగా భావించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సును పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం పీఆర్టీయూ భవనంలో నిర్వహించిన ఈ సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి కల్లెం భూమారెడ్డి ఆస్పత్రి వైద్యుడు కల్లెం వెంకట్‌రెడ్డి చేస్తున్న సామాజిక కార్యక్రమాలకు గాను పీఆర్టీయూటీఎస్ తరపున ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ చాలా మంది ప్రభుత్వ కొలువులు సాధిస్తారని, అందులో ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమన్నారు. నేడు ప్రపంచ దేశాలు భారత దేశం వైపు చూసేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దేలా బోధనలు చేయాలని సూచించారు. పలు సమస్యలను సంఘం నాయకులు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వాటి పరిష్కరం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వాలు ఎవైన వాటికి సమస్యలున్నాయని, కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని చెప్పారు. సమాజం పట్ల రాజకీయ నాయకులకు ఉన్న బాధ్యత ఉపాధ్యాయులకు కూడా ఉంటుందన్నారు. ఆ దిశగా ప్రతి ఉపాధ్యాయుడు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ ప్రధాన కార్యదర్శి నర్సింహా స్వామి, గౌరవాధ్యక్షుడు గోవర్ధన్, రాజు, వినోద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జయశ్రీ, జోత్స్న, కృష్ణవేణి, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

డీఎస్పీ సమ్మేళనానికి వెళ్లిన నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లోని ఆదిభట్ల ప్రాంతంలో జరుగుతున్న ధర్మ సమాజ్ పార్టీ మహా సమ్మేళనానికి ఆదిలాబాద్ జిల్లా డీఎస్పీ పార్టీ కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్ ఎండ్ గెస్ట్ హౌస్ వద్ద నుంచి బస్సు ద్వారా ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల బ్రతుకులకు మార్పు కోరుతూ భవిష్యత్ కార్యాచరణ పోతుందని అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ కార్యకర్తల సమ్మేళన సభలో మార్గదర్శకం చేయబోతున్నారని అన్నారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి, రాబోయే రోజులలో బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రజా సమస్యల పోరాటాలపై పార్టీ ఉద్యమిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో బహుజన జాతులన్నీ ఈ పోరాటాలలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ వివిధ మండలాల నాయకులు అగ్గిమల్ల గంగన్న, సంగర్తి రాంచందర్, పవన్, ఒమన్న, టి.సంతోష్, తిరుపతి, నవీన్, సాయి, వినుకుమర్, విజయ్, ఏనుగు శ్యామల, ఎల్మలా మంజుషా, లక్ష్మి, ఎల్మల సుష్మా, శ్రీవాణి, దివ్యవాణి ఉన్నారు.

మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మల్లెపూల శివారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి కార్తీక్, కోశాధికారిగా బారె గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా మల్లెపూల మహేందర్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా కట్ట భూమేశ్, సోమ శంకర్, కుమ్మరి పోతారెడ్డి, కుమ్మరి చంద్రశేఖర్, కైపెల్లి రవి, బారె భోజన్న, అల్లకొండ పోతన్న, మల్లెపూల సత్యనారాయణ, లంక రాజేష్, అడప రాజేశ్వర్, సలహాదారులుగా రావుల శంకర్, ఆర్టీపీ ప్రసాద్, రావుల గణపతిలను ఎన్నుకున్నారు. సంఘం అభివృద్ధికి పాటుపడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ఫోన్ ఇన్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి భూసమస్యలు, ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, నీటి, మురుగు కాలువలు, ఫారెస్ట్, పెన్షన్ సమస్యల ఫోన్ కాల్స్ వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడం కోసం ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంతో పాటు స్వర్ణ గ్రామంలో కలాం గుణం ఎడ్యుకేషనల్ అండ్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారందేశ తొలి విద్యాశాఖ మంత్రి స్వాతంత్ర సమరయోధులు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ సుజాత నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ పద్మ వీరయ్య, నాయకులు కే.మహేష్‌రెడ్డి, సొసైటీ జిల్లా వ్యవస్థాపకులు అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, మండలాధ్యక్షులు సయ్యద్ నాయీముద్దీన్ అబ్దుల్, ఎస్‌కే ఆజం, జమీర్, శేఖ్ మసూద్, నిర్మల్ పట్టణాధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మొహమ్మద్ బిన్ అలీ, శేఖ్ ఇంతియాజ్, శేఖ్ షాదుల్లా హుస్సేన్, ఎస్‌కే షకీల్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అవార్డులు తీసుకోవడం గర్వకారణం

- మాజీ మంత్రి జోగు రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

13 ఏండ్లుగా రక్తదానం చేస్తు జాతీయ స్థాయిలో జిల్లా కేంద్రంలోని బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటి అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సభ్యులు జాతీయ స్థాయి అవార్డులు తీసుకోవడం గర్వకారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో యంగ్ ఇండియన్ సేవ పురస్కార్ 2024 నిర్వహించారు. ఇందులో బెస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు జాతీయ ఆవార్డును అందించడంతో ఈ సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి సత్కరించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో సేవ కార్యక్రమాలు ఇలానే కొనసాగిస్తు యువతకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సాజిదోద్దిన్, రోకండ్ల రమేష్, జగదీష్, బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటి సభ్యులు శ్రీకాంత్, ఆశిష్, ఆసిఫ్, మహేందర్ పాల్గొన్నారు.

చల్ చల్ బండి..చకడా బండి..



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మన తాతలు, ముత్తాతలు ఎక్కడకు వెళ్లినా కాలినడకతో పాటు ఎడ్లబండ్లలో వెళ్లేవారు. తరువాత కాలనుగుణంగా సైకిళ్లను ఉపయోగించేవారు. ప్రస్తుతం ఎక్కడ ప్రయాణించిన టూ వీలర్‌తో పాటు కార్లను ఉపయోగిస్తున్న కాలమిది. కాని ఏజెన్సీలో ఆదివాసులు మాత్రం తమ పూర్వీకులు ఉపయోగించిన చకడ (చిన్న ఎడ్లబండి) ని ఇప్పటికిని వినియోగిస్తున్నారు. మండలంలోని ధర్మగూడకు చెందిన చాకటి హన్మంతు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దుబ్బగూడకు తమ బంధువుల వద్దకు ఈ చకడా బండితోనే ప్రయాణించాడు. పెట్రోల్, డీజిల్ అవసరం లేకుండా ఎలాంటి కాలుష్యం లేకుండా ప్రయాణిస్తున్నాడు. ఇప్పుడు ఇవి అరుదుగా కనిపిస్తున్నాయి.

బాధిత విద్యార్థికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



వాంకిడి ఆశ్రమ బాలికల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కలుషిత ఆహారంతో అస్వస్థతకు గురైన విషయం తెలుసుకుని మంచిర్యాల మాక్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పరిస్థితి విషమంగా మారకముందు వారిని కలెక్టర్, ఐటీడీఏ పీఓ పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీడీ గిరిజన సంక్షేమ గంగారం, నైతం లక్ష్మణ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎంఈఓకు సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



పదేళ్లకు పైగా కాగజ్‌నగర్ మండల విద్యాధికారిగా విధులు నిర్వర్తించి బదిలీ అయిన గడ్డం భిక్షపతిని ఆదివారం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డీఆర్‌సీ భవనంలో సంఘం పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులు మాట్లాడుతూ భిక్షపతి పదేళ్ల కాలంలో ఈ ప్రాంతంలో విద్యారంగానికి అందించిన సేవలు మర్చిపోలేనివన్నారు. సంఘంలో కూడా ఆయన సమర్థవంతంగా తన బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం నూతన ఎంఈఓ వాసాల ప్రభాకర్‌ను కూడా సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు ఉప్పుల నరసింహాచారి, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎనగంటి భిక్షపతి, పత్తిపాక శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ మృతి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ శంకర్(50) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన మండలంలోని వేంపల్లి గ్రామ శివారులో జరిగింది. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాథోడ్ శంకర్ కొన్ని రోజుల క్రితం మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న హుండికిలి గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రోజువారీగా ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు విధులు ముగించుకొని తన స్వగ్రామమైన రెబ్బెన గ్రామానికి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్లి తిరిగి రెండు గంటల షిఫ్ట్‌కు వెళ్తున్న క్రమంలో వేంపల్లి గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వస్తున్న షేక్ అహ్మద్ గూడకు చెందిన నిఖిల్, తన మిత్రుడైన పారిగాం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఆ జాగ్రత్తగా నడుపుతూ రాథోడ్ శంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఇరువైపులా పడిపోయారు. గమనించిన స్థానికులు కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ శంకర్ తలకు తీవ్ర గాయం కావడంతో వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినాడని తెలిపారు. మృతుని భార్య రాథోడ్ కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

టీయూటీఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నూతన జిల్లా కమిటీని ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్‌పంపు జెడ్పీఎస్ఎస్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బత్తుల శాంతికుమార్, గౌరవ అధ్యక్షులుగా గోడం జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల సదాశివ్, సహాధ్యక్షులుగా రాథోడ్ ప్రకాష్, భాను ప్రకాష్, మహిళా సహాధ్యక్షులుగా వి.సవిత, సంయుక్త కార్యదర్శులుగా బానోత్ ప్రకాష్, ఇస్లావత్ ధన్‌రాజ్, మహిళా కార్యదర్శులుగా లావణ్య, శిల్ప, ఆర్థిక కార్యదర్శిగా కె వెంకట్‌రావుతో పాటు జిల్లా కార్యదర్శులుగా 11 మందిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బన్న రవీందర్, పరిశీలకులుగా పత్తి సత్తయ్య వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు శాంతికుమార్ మాట్లాడుతూ జీపీఎఫ్ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలని, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, మిగిలిన పీజీహెచ్ఎం పోస్టులను భర్తీ చేయాలని, సీపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని, 317 సమస్యను కమిటీ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఏకగ్రీవంగా ఆర్యవైశ్య నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని కర్జెల్లి మోడ్రన్ రైస్ మిల్‌లో ఆర్యవైశ్య నూతన మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మిరియాల కాశయ్య, బండ నందకుమార్, నూకల వెంకటేశ్వర్లు, బోనగిరి శ్రీకాంత్, కొలిపాక మధుకర్, మండల అధ్యక్షులుగా నూకల మొండయ్య, ప్రధాన కార్యదర్శిగా బండ ప్రకాష్, కోశాధికారిగా ఎలుకా సుదర్శన్, ప్రచార కార్యదర్శిగా రేణిగుంట్ల శ్యాంకుమార్, ఉపాధ్యక్షులుగా బండ రమేష్, యువజన సంఘం సభ్యులుగా నూకల శ్రీధర్, బొనగిరి వంశీ, కోట సాయికృష్ణ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. మండల మహిళా కమిటీ అధ్యక్షురాలు పార్వతల కవిత, ప్రధాన కార్యదర్శి బండ సుమలత, ప్రచార కార్యదర్శి జిల్లపెల్లి అపర్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పద్మశాలి సంఘ బలోపేతానికి కృషి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణ పద్మశాలి సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆ సంఘం అధ్యక్షులు దాసరి వెంకటేష్ కోరారు. ఆదివారం ద్వారకానగర్‌లోని పద్మశాలి సంఘం కార్యాలయంలో ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ సంఘానికి చట్టబద్ధత కల్పించాలనే ఉద్దేశ్యంతో రిజిస్ట్రేషన్ చేయించినట్లు తెలిపారు. ఇక నుండి సంఘం రిజిస్ట్రేషన్ నెంబర్‌తోనే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఇక నుండి క్షేత్రస్థాయిలో సంఘాన్ని బలోపేతం చేస్తామని, మరికొన్ని కమిటీలను కూడా త్వరలోనే వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొంగ సంపత్‌కుమార్, గౌరవ అధ్యక్షులు గడదాసు నారాయణ పాల్గొన్నారు.

అటవీ అధికారులను సస్పెండ్ చేయాలి

- ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు
- నేటి నుంచి రేంజ్ కార్యాలయం ఎదుట ఆమరణ దీక్ష



నవతెలంగాణ-సిర్పూర్(టి)

అమయకులపై విక్షణ రహితంగా కొట్టిన అటవీ శాఖ అధికారులను సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. సిర్పూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసు ఎదుట నేటి నుండి ప్రారంభమయ్యే ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు తెలపాలని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలను నిరసిస్తూ నేటి నుంచి అటవీ క్షేత్రాధికారి కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షను చేపటుడుతున్నామని తెలిపారు. ఫారెస్ట్ సిబ్బంది వలన ఇబ్బందులు పడుతున్న బాధితులు ఎక్కడున్న ఈ దీక్షకు వచ్చి సంఘీభావం తెలిపి పాల్గొనాలని కోరారు. సిర్పూర్ రేంజర్, సెక్షన్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయాలని, వారికి వత్తాసు పలుకుతూ వారికి అండగా నిలుస్తున్న డీఎఫ్ఓను వెంటనే బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సిర్పూర్ నియోజకవర్గంలోని వివిధ రేంజ్‌లో అడ్డగోలు అక్రమ సంపాదనకు మరిగిన ఫారెస్ట్ అధికారులను కాపాడుతూ వారికి నెలవారీ టార్గెట్లు పెట్టి డీఎఫ్ఓ ముడుపులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, అటవీ శాఖ మంత్రికి ఫిర్యాదు చేశామని, అలాగే జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు కూడా సిర్పూర్‌లోని బెంగాలీ క్యాంప్ రైతులపై జరిగిన థర్డ్ డిగ్రీ విషయంపై ఫిర్యాదు చేశామన్నారు. వారు కూడా రంగంలో దిగుతారని, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులు కాంపా నిధులను డీఎఫ్ఓ దుర్వినియోగం చేశారని, వాటిపై సీబీఐ ఎంక్వయిరీ కోసం లేఖ రాశామని తెలిపారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకునే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఎల్ములే శంకర్, నరులెవాను పటేల్, సీనియర్ నాయకులు నీరటి సత్యనారాయణ, నేరేల్ల అశోక్, ఒడ్డేటి నాని, అశోక్ ఆర్య, చనకపురే శంకర్, రాచార్ల మహేష్, మనోజ్ మండల్, దంద్రే శంకర్, సంతోష్, భగవాన్, దుర్గం ప్రశాంత్, సాయి భనార్కర్, జావిద్ అహ్మద్, చౌదరి సునీల్ పైడి ప్రకాష్, ఆత్మకూరి కుమార స్వామి, నూలిగొండ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-రెబ్బెన

మండలంలో రాంపూర్, రాళ్ళపేట గ్రామాలలో డీవైఎఫ్ఐ 44వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు చాపిడీ పురుషోత్తం, మండల కార్యదర్శి ఆత్మకూరు సతీష్ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ 1980 నవంబర్ 1, 2, 3 తేదీలలో మొదటి జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రం లూధియాన నగరంలో ఆవిర్భవించిందన్నారు. పోరాటం త్యాగంతో అభివృద్ధి అనే లక్ష్యంతో విద్య, ఉద్యోగ, ఉపాధి ప్రభుత్వం కల్పించాలని పోరాడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదం పేరుతో యువతను మత్తులో ముంచి ఇచ్చిన హామీలను మరిచిపోయిందని మండిపడ్డారు. ఉద్యోగం ఉపాధి కల్పించక చేతులెత్తేసి ప్రభుత్వ రంగాల్లో ఎన్నో ఖాళీలున్న భర్తీ చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి, మండల ఉపాధ్యక్షులు చల్లూరి క్రిష్ణ, మండల నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, రంజిత్ పాల్గొన్నారు.

వాంకిడి : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించి నాయకులు మాట్లాడుతూ పోరాటం, త్యాగం, పురోవృద్ధి అనే లక్ష్యంతో విద్య, ఉపాధి, ఉద్యోగం కల్పించాలని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుర్గం నిఖిల్, మండల కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, గ్రామ సభ్యులు చాపిడీ నిఖిల్, వడ్లూరి దిలీప్, నారాయణ, చపిడి అనిల్, అంజన్న పాల్గొన్నారు.



హోరాహోరీగా హ్యాండ్ బాల్ పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా బాలికల పాఠశాలలో రెండు రోజులుగా పీడీ గడిగొప్పుల సదానందం జ్ఞాపకార్థం జరుగుతున్న 38వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్ బాల్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు లీగ్ మ్యాచులు కొనసాగగా లీగ్ మ్యాచులలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి మహబూబ్ నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు సెమి ఫైనల్ పోటీలకు చేరుకున్నాయి. ఆదివారం మధ్యాహ్నం జరిగిన సెమి ఫైనల్ పోటీల్లో కరీంనగర్ జట్టుపై 02-26 పాయింట్లతో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజయం సాధించగా, రంగారెడ్డితో మహబూబ్ నగర్ జట్టుకు పోటీ జరగగా 20-06 పాయింట్లతో మహబూబ్‌నగర్ జట్టు గెలుపొంది సోమవారం జరిగే ఫైనల్ పోటీలకు ఎంపికయ్యాయని నిర్వాహకులు తెలిపారు. సెమి ఫైనల్ మ్యాచులను రాయ్ సెంటర్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, ఉమెన్ రైడ్స్ చీఫ్ లింగరావు, ఆశ్రమ పాఠశాల క్రీడల అధికారి బండ మీనారెడ్డి, వాసవి హైస్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ రూప క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రారంభించారు. కాగా ఫైనాల్‌కు అర్హత సాధించినందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు క్రీడాకారులు, కోచ్ సునార్కర్ అరవింద్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు గొనె శ్యాంసుందర్ రావు, ప్రధానకార్యదర్శి కనపర్తి రమేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, ఆశ్రమ పాఠశాల క్రీడల అధికారి మీనారెడ్డి, కోచ్ సాగర్, రాకేష్, తిరుమల్ పలువురు అభినందించారు.



అంగరంగ వైభోగంగా బులాయి వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



దీపావళిని పురస్కరించుకొని ఆసిఫాబాద్ మండలం రాజుర గ్రామంలో బులాయ్ వేడుకలు అంగరంగ వైభోగంగా సాగాయి. దీపావళి పండగ రోజు ప్రారంభమైన వేడుకలు మూడ్రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు సాంప్రదాయ బద్ధంగా మట్టిని తెచ్చి బులాయ్, బొండోబా మట్టి ప్రతిమలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆఖరి రోజు శనివారం ప్రతిమలను బతుకమ్మ వలె మధ్యలో ఉంచి యువతులు, మహిళలు ఆడిపాడి ఆదివారం ఉదయం గ్రామంలోని పెద్ద వాగు వద్ద ప్రతిమలను నిమ్మజనం చేశారు. ఇలా చేయడం ఏండ్ల నుండి ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

మధ్యాహ్న భోజనం కార్మికులకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన వేతనం వెంటనే చెల్లించాలని, నిర్లక్ష్యం చేస్తే సచివాలయాన్ని ముట్టడిస్తామని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మండల కార్యదర్శి రూప అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 5 నెలలుగా వేతనాలు, బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు కొన్ని మండలాల్లో గత ప్రభుత్వంలో చేసిన అల్పాహారం బిల్లులు, గౌరవ వేతనం ఇంతవరకు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు మేనిఫెస్టోలో ప్రకటించిన రూ.10 వేల వేతనం వెంటనే చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారంతో పాటు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ మండల కమిటీ సభ్యులు లక్ష్మీ, రేణుకా, సత్యమ్మ, తిరుమల, సునీత, కమర్ బేగం పాల్గొన్నారు.

పోరాట ఫలితమే మెస్ చార్జీల పెంపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గురుకుల ఉపాధ్యాయుల పోరాట ఫలితంగా నేడు మెస్ ఛార్జీల పెరిగాయని టీఎస్‌యూటీఎఫ్ టీజీఎస్‌డబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు దూలం ఎల్లయ్య అన్నారు. టీఎస్‌యూటీఎఫ్, గురుకుల సంఘాల జేఏసీ నిర్వహించిన మహాధర్నా ఫలితమే విద్యార్థుల మెస్ ఛార్జీల పెంపు జరిగిందన్నారు. ఎనిమిదేండ్లుగా పెరగని మెస్ ఛార్జీలతో పిల్లలకు పౌష్టికాహారం అందించటం కష్టంగా ఉన్నందున, విద్యార్థుల సంక్షేమం కూడా ఉపాధ్యాయుల సామాజిక బాధ్యతగా భావించి సెప్టెంబర్ 28న జరిగిన మహాధర్నాలో మెస్ ఛార్జీల పెంపు ప్రధానంగా చేర్చడం జరిగిగిందని తెలిపారు. జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.

రాంపూర్‌లో ముగిసిన దండారి ఉత్సవాలు



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసులు అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్న ఆదివాసీల దండారి ఉత్సవాలు మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ పరిధిలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం కొలబోడి పూజలతో దండారి ఉత్సావాలు ముగిశాయి. తొమ్మిది రోజుల నుండి భోగి పూజలతో ప్రారంభమైన దండారీ ఉత్సవాలు గ్రామంలో సంస్కృతి సాంప్రదాయాలతో భక్తి శ్రద్ధలతో ఎత్మసూర్ పెన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రత్యేకమైన వస్త్రధారణతో పురుషులు కాళ్లకు గజ్జెలు కట్టి కోలాట, గుస్సాడీ నృత్యాలు, మహిళలు రెలా పాట నృత్యాలు చేస్తూ చూపపరులను ఆకట్టుకున్నారు. ప్రత్యేకమైన వేషధారణలతో హాస్య నాటికలు ప్రదర్శించారు. ప్రతి రోజు డప్పు చప్పులతో గ్రామమంత హోరేత్తించారు. తమ గ్రామం నుండి మరోక గ్రామానికి దండరీ బృందంగా వెళ్లి తమ అతిథ్యాన్ని స్వీకరించారు. చివరి రోజు ప్రతి ఇంటింటికి వెళ్లి దండరీ బృందానికి మంగళ హారతులు ఇచ్చి ప్రతి ఇంటి నుండి ధాన్యం, బియ్యం స్వీకరించారు. అనంతరం గ్రామం బయట ఉన్న ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీలు, పోరిలు, పురుషులు, మహిళలు దండారీ దీక్షను విరమించారు. ఇప్ప చెట్టు వద్ద గుస్సాడీ నెమలి టోపీలు, డప్పులు, కోలాట సామాగ్రి, సాంప్రదాయ వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలోని వాగుకు వెళ్లి స్నానాలు ఆచరించారు. అనంతరం సహంపక్తి భోజనాలతో దండారి ఉత్సవాలు ముగిశాయి. ఈ దండారి ముగింపు ఉత్సవాల్లో మాజీ ఎంపీటీసీ కోట్నాక సకరాం, మాజీ సర్పంచ్ తొడసం జగన్నాథరావు, గ్రామ పటేల్ రాంషావ్, సీతారాం, పాండు, బడిరాం, సంజీవ్, శ్యాంరావు, సోనేరావు, యశ్వంత్, పొట్టి రావు, మారుతి, పాల్గొన్నారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రం ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం హర్షణీయమని టీడబ్ల్యూయూఆర్‌జేసీ కెరమెరి ప్రిన్సిపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో విద్యార్థులు ఫ్లకార్డులు ప్రదర్శిస్తు సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదలు తెలిపారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో అందించడం కోసం సీఎం మెస్ చార్జీలను పెంచారన్నారు. ఈ నిర్ణయంతో వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. చార్జీలను పెంచిన సీఎంతో పాటు డిప్యూటి సీఎం, ప్రిన్సిపల్ కార్యదర్శులకు విద్యార్థుల తరపున ప్రత్యక ధన్యవాదాలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్, అటెండర్ పోస్టుల కోసం అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ శివ చరణ్ కుమార్ కోరారు. అసిస్టెంట్ కుక్ కోసం ఏడో తరగతి, అటెండర్ కోసం పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 18 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయసు గల మహిళలు ఈ నెల 4 నుంచి 8వ తేదీలోగా కేజీబీవీ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కేజీబీవీ పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంజేపీ విద్యార్థి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మహాత్మ జ్యోతిబాపూలే లక్షెట్టిపేట బాయ్స్ కళాశాలలో చదువుతున్న ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థి శ్యామ్ అండర్-19 కబడ్డీ రాష్ట్ర స్తాయి పోటీలకు సెలెక్ట్ అయ్యారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు తెలిపారు. ఈ నెల 3 నుండి 5 వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ హర్షం వక్తం చేశారు. పిల్లల్ని క్రమశిక్షణతో పాటు, రాష్టస్థాయిలో సెలెక్ట్ అయ్యేలా తీర్చి దిదుతున్న పీడీ, పిఈటీని ప్రత్యేకంగా అభినందించారు.

సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

నవతెలంగాణ-జన్నారం



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జన్నారం పోలీస్ కానిస్టేబుల్ సత్తన్న అన్నారు. ఆదివారం వాహనదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. బ్యాంకుల పేరుతో ఓటీపీలు ఇతర మెసేజ్లు లింకులు వచ్చిన వాటిని ఓపెన్ చేయకూడదన్నారు. సెల్ ఫోన్లు ఇతర వస్తువులు పడగొట్టినా వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేస్తే, సాధ్యమైనంత త్వరగా పట్టుకొని బాధితులకు అందిస్తామన్నారు. పోలీసులు వాహనదారులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల నియోజకవర్గలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆ పార్టీ పార్లమెంటు కన్వీనర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. పెద్దపల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు ఆధ్వర్యంలో నస్పూర్ మున్సిపాలిటీలోని శ్రీరాంపూర్ టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ జాతీయ అద్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 26న పార్టీ కేంద్ర కార్యాలయం లో ప్రారంభించినట్లు తెలిపారు. ఈసారి ఏ పార్టీ ఇవ్వని విదంగా కార్యకర్తల సంక్షేమం కోసం కేవలం రూ.100లతో సభ్యత్వం పొందితే రెండు సంవత్సరాలు 5 లక్షల ప్రమాదభీమాతో పాటు సాధారణ మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు 10వేలు అందించనున్నారని తెలిపారు. అదేవిధంగా ఆ కార్యకర్తకు చిన్నపిల్లలు ఉంటే వారి విద్యాభ్యాసం పార్టీ చూసుకుంటుందని, అలాగే ఇంకా అనేక కార్యకర్తల సంక్షేమానికి పలు కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. వారి కుటుంబ సభ్యులకు విద్య వైద్య, ఉపాధి కోసం,ఆడపిల్లల వివాహలకు సాయంచేయడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం అభిమానులు, నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ వివిద వర్గాల ప్రజలు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంజయ్ కుమార్‌ను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంటి రాజయ్య ఆవుల సుధాకర్, సామ రఘుపతి, కె రాజు, మిడిదొడ్డి మొండయ్య వడ్లకొండ వెంకన్న, బొజ్జ రవి, సంకూరి భూమయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకోవాలని ఏఎంసీ మాజీ డైరెక్టర్ వల్లాల నర్సాగౌడ్ అన్నారు. మండలంలోని ధర్మారం గ్రామంలో దుర్గం గౌతమి, దుర్గం వర్ధన్‌లు ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించడంతో, వారిని ఆదివారం గ్రామస్తులు వలు సంఘాల నాయకులు శాలువా పూలమాలలతో సన్మానించారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముమ్మడి రమేష్, రాగుల రామచంద్రం పాల్గొన్నారు.

అనుమతి లేకుండా యూనియన్ చందా రికవరీ చేయడం సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

కార్మికుల అనుమతి లేకుండా యూనియన్ చందా ఎలా రికవరీ చేస్తారని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. .సింగరేణి యాజమాన్యం గుర్తింపు సంఘానికి కొంతమంది కార్మికులకు వారి అనుమతి లేకుండా అక్టోబర్ నెల జీతంలో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున టెంపుల్ రికవరీ కోడ్ 1835 నెంబర్‌పై రికవరీ చేసినట్లుగా వారి దృష్టికి వచ్చిందని తెలిపారు. కార్మికుని అనుమతితో అతని జీతం నుంచి యూనియన్ చందాకు 1875 యూనియన్ కోడ్ మీద రికవరీ చేయాలి తప్ప కార్మికుల అనుమతి లేకుండా టెంపుల్ కమిటీ కోడ్ 1835 పేరిట రికవరీ చేయటం ఇది యజమాన్యానికి తగదని, ఏకపక్షంగా కార్మికుల రికవరీకి సంబంధించిన ఆథరైజేషన్, స్టేట్మెంట్‌తో సరిచూడకుండా రికవరీ చేయటం సరైన పద్ధతి కాదని, దీనికి పూర్తి బాధ్యత యజమాన్యమే వహించాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ గృహిణిల దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ గృహిణిల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల గంగాధర్, బీసీ సంఘం నాయకులు మామిడి విజయ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే, జ్యోతిబాపూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. వారు మాట్లాడుతూ మానవజాతి మనుగడకు ప్రాణం పోసేదే మగువా అన్నారు. త్యాగంలో అనురాగంలో తరగనీ గని మగువా అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఉప్పు చంద్రశేఖర్, గోలి రాము పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-వేమనపల్లి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా14 సంవత్సరాల విభాగం ఖోఖో పోటీలలో నీల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆల్వియా మహిమీన్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు గిరిధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు కామారెడ్డిలో ఈ నెల 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఎంపికైనందుకు జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణి రాజా, వ్యాయామ ఉపాధ్యాయులు డా.మల్లేష్, మంచిర్యాల ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు అధికారులు ప్రజా ప్రతినిధులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు అభినందించారు.

రెండోసారి రేవంతే సీఎం

● ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

నవతెలంగాణ-మంచిర్యాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఎస్ఆర్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పదవీ గండం ఉందని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి చిలక పంచాంగం చెప్పడం మానుకోవాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత చిలక జ్యోతిష్యం నేర్చుకున్నాడని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో అధికారంలోకి వచ్చామని మళ్లీ వచ్చే ఎన్నికల్లో కూడా రేవంత్ నాయకత్వంలో100 సీట్లతో అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి రావడం అనేది అసంభవమని, బీఆర్ఎస్ దుకాణం మూత పడిందని తెలిపారు. మంచిర్యాలలో రూ.300 కోట్ల వ్యయంతో 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పనులు ఈ నెలాఖరులో ప్రారంభ మవుతాయని , రూ.255 కోట్లతో కరకట్టల నిర్మాణం పనులు మొదలవుతాయని తెలిపారు. ఆస్పత్రి నిర్మాణంపై పెదవి విరుస్తున్న విపక్షాలకు అభివృద్ధితో బుద్ధి చెబుతానన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఏకమయ్యాయని విమర్శించారు. నియోజక వర్గంలో రహదారుల నిర్మాణంకు రూ.70 కోట్ల త్వరలోనే మంజూరు చేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, మున్సిపల్ వైస్ చైర్మెన్ సళ్ళ మహేష్, కౌన్సిలర్లు బనేష్, సంజీవ్ పాల్గొన్నారు.

సర్వే ప్రొఫార్మాలో గల ప్రతి అంశానికి ప్రాధాన్యతనివ్వాలి



నవతెలంగాణ-జైపూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో కోరిన ప్రశ్నల్లో ప్రతి అంశానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. జైపూర్, భీమారం మండల కేంద్రంలో కొనసాగుతున్న కుటుంబ సర్వే తీరు ఆదివారం ప్రత్యక్షంగా పరిశీలించిన ఆయన కుటుంబాలకు సంబంధించిన ప్రతి అంశాన్ని సర్వే ప్రొఫార్మాలో పొందుపర్చాలని తెలిపారు. కుటుంబాల వారిగా సమాచారం సేకరిస్తున్న ఎన్యూమరేటర్ల ద్వార విషయాన్ని తెల్సుకుంటూ పూర్తి స్థాయి సమాచారం సేకరించడంలో సూపర్‌వైజర్లు ఎన్యూమరేటర్లకు సహకరించాలని తెలిపారు. బ్లాకుల వారిగా ప్రతి ఇంటికి స్టిక్కర్లు అంటిస్తు అదే క్రమంలో సర్వే కొనసాగాలని ఆయన సూచించారు. మండల ప్రత్యేక అధికారి, ఉద్యానవనశాఖ జిల్లా అధికారి కల్పన జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ, భీమారం ఎంపీడీఓ మదుసూధన్, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు రావు పరిశీలించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి క్రిష్ణమూర్తి పర్యవేక్షించాలని సూచించారు.



గుడి పేరుతో చందా చేయడం సరికాదు : హెచ్‌ఎంఎస్



నవతెలంగాణ-మందమర్రి

గుడి పేరు మీద గుర్తింపు సంఘానికి కార్మికుల నుంచి చందాను వసూలు చేయడాన్ని హెచ్‌ఎంఎస్ నాయకులు ఖండించారు. హెచ్‌ఎంఎస్ మందమర్రి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ జే శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. దీపావళి బోనస్ చర్చల్లో భాగంగా ఢిల్లీలో జాతీయ సంఘాలు హెచ్‌ఎంఎస్, బీఎంఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ పాల్గొని గత సంవత్సరం రూ.85,500 నుంచి రూ.93,750 ఎక్కువగా ఇప్పించడం జరిగిందన్నారు. కార్మిక సోదరుల అనుమతితో సంఘాలన్నింటికీ సభ్యత్వం తీసుకునే హక్కు ఉందని, కానీ కార్మికుల సంతకాలు లేకుండా గుడి పేరు మీద చందా వసూలు చేసుకోవడానికి గుర్తింపు సంఘానికి యాజమాన్యం అనుమతి ఇవ్వడం సరికాదని వ్యతిరేకించారు. కార్మికుల అనుమతి లేకుండా వసూలు చేయడం సరికాదని హెచ్చరించారు. కార్మికుల వద్దకు వచ్చి వారి అనుమతితో సభ్యత్వ రుసుమును చేసుకోవాలనే చట్టం ఉన్నప్పటికీ చట్ట విరుద్ధంగా కార్మికులకు తెలియకుండా కార్మికుల అనుమతి లేకుండా యాజమాన్యంతో కుమ్మక్కై గుడి పేరుతో రూ.500 ఏఐటీయూసీ సంఘం తీసుకొని ఘరానా మోసానికి పాల్పడిందని ఆరోపించారు. ఏఐటీయూసీ నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 1835 అనే కోడ్ దేవాలయానికి సంబంధించిన లావాదేవీలను సూచిస్తుందని, 18 75 కోడ్ మాత్రమే యూనియన్లకు సంబంధించిన సభ్యత్వ రుసుమును వసూలు చేసుకోవడానికి చట్టం అవకాశం కల్పించిందన్నారు. కార్మికుల వద్ద నేరుగా చందా అడిగే దమ్ము లేక ఏఐటీయుసీ నాయకులు దొడ్డిదారిన గుడి పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న ఏఐటీయుసీ నాయకులను కార్మికలందరూ నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్మికుల వేతనాల నుండి దొడ్డి దారిన రికవరీ చేసిన రూ.500 వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని ఏఐటీయూసీ సంఘాన్ని డిమాండ్ చేశారు.

జీఎంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌గా సూర్యనారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీరాంపూర్ ఏరియాలో పని చేసిన జీఎం సంజీవరెడ్డి ఉద్యోగ విరమణ పొందడంతో ఆర్జీ-2 ఏరియా జనరల్ మేనేజర్‌గా పనిచేసిన సూర్యనారాయణ శ్రీరాంపూర్ ఏరియాకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ పూల బొకెతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీ రెడ్డి, ఏజెంట్లు రాముడు, శ్రీధర్, డీజీఎంలు పి అరవింద రావు, చిరంజీవులు, ఆనంద్ కుమార్, డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, చేంద్రలింగం, ఏరియా సర్వే అధికారి వెంకటేశం, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కరెడ్డి, ఏరియా ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన జీఎం.

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సూర్యనారాయణ ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు.

సిక్కు సంఘం అధ్యక్షునిగా సర్దార్ రంజీత్ సింగ్

నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని గురునానక్ గార్డెన్‌లో ఆదివారం 10 జిల్లాల సిక్లిగర్(సిక్కు) కుల సంఘం సమావేశంలో సర్దార్ రంజీత్ సింగ్‌ను ఏకగ్రీవంగా 10 జిల్లాల అధ్యక్షునిగా ఎన్నికూన్నారు. ఈ సందర్భంగా రంజిత్ సింగ్ మాట్లాడుతూ పది జిల్లాల అధ్యక్షునిగా తనను ఎన్నుకున్న వివిధ జిల్లా అధ్యక్షులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పదవిని సమర్ధవంతగా నిర్వహిస్తూ సంఘంలో ఏ సమస్యలు వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. సమావేశంలో ఆదిలాబాద్, కొమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.



12 ఎకరాల్లో క్రీడా ప్రాంగణం ఏర్పాటు



నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. ఆదివారం సాయికుంటలో 14 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఎకరాల స్థలంలో రెండు ఎకరాలు నర్సింగ్ కళాశాలకు మిగతా 12 ఎకరాలు ఇండోర్ స్టేడియం నిర్మాణానికి కేటాయిస్తామన్నారు. అందులో ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్, స్విమ్మింగ్ పూల్ నిర్మాణం చేపడతామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తీసుకువచ్చి క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సాహిస్తోందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివ సేనరెడ్డి తెలియజేశారు. యువకుల చూపు క్రీడల వైపు మళ్లించి, క్రీడాభివృద్ధికి పాటుపడుతమని తెలియజేశారు. మంచిర్యాలను స్పోర్ట్స్ హబ్‌గా మార్చేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

'బాల్య స్నేహాన్ని పదిలంగా నిలుపుకుందాం'



నవతెలంగాణ-తాండూర్

బాల స్నేహాన్ని కొనసాగించడం ద్వారా ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయని ఉద్యోగ బాధ్యతల్లో బిజీ జీవితాన్ని గడిపేవారు బాల్య స్నేహాన్ని పదిలంగా కొనసాగించాలని పెద్దపల్లి జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి రాహుప్ ఖాన్ అన్నారు. ఆదివారం తాండూర్ సురభి ఫంక్షన్ హాల్‌లో జరిగిన 19991 పదవ తరగతికి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలోని మధురానుభూతులను నెమరు వేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. భవిష్యత్తుకు పునాదులు వేసిన బాల్యం తాలూ మధురాను స్మృతులను ఉపాధ్యాయులు స్నేహితుల మధ్య పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థి దశలోని మధురానుభూతులను నెమరు వేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మానవ సంబంధాల్లో బాల్య స్నేహం గొప్పదని కన్న తల్లిదండ్రులు తోబుట్టువులతో సమానంగా మానసిక ప్రశాంతను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో తాండూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1991వ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన విద్యార్థులంతా సమావేశానికి హాజరయ్యారు. బాల్యంలోని తీపి జ్ఞాపకాలను వంచుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు కార్యక్రమానికి హైస్కూల్‌లో చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన వివిధ శాఖలకు చెందిన యువకులు రిటైర్డ్ టీచర్స్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల ఏర్పాటు



నవతెలంగాణ-మందమర్రి

ప్రయాణికుల సౌకర్యార్థం మందమర్రి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 12 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేసారు. దీనిలో భాగంగా పాత బస్టాండ్ ప్రాంతంలో 9, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న బస్టాండ్ వద్ద 3 బెంచీలను ఏర్పాటు చేసినట్లు ఆ క్లబ్ జిల్లా చైర్మన్ సొతుకు సుదర్శన్ తెలిపారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం బెంచీలు వేసినందుకు ప్రయాణికులందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. 210 దేశాల్లో క్లబ్ సేవలు చేస్తున్నట్లు వెల్లడించారు. వికలాంగులకి కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా జిల్లా ఎంపవర్మెంట్ కో ఆర్డినేటర్ కొట్ల అనిత, ప్రెసిడెంట్ కొక్కుల మధు, సెక్రటరీ సొతుకు రత్న జానకి, కొక్కుల కేదారి, మొగల్ రమేష్, ఎండీ నిజాం, నోముల ఉపేందర్‌గౌడ్, ఎండీ హఫీస్, చంద్రయ్య పాల్గొన్నారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలోగల గౌతమేశ్వరాలయంలో నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. గణపతి పూజతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు నవగ్రహ విగ్రహాలను పూల మంత్ర జలాధివాసం, హోమం మంటప ప్రవేశ కార్యక్రమాలను నిర్వహించారు. నవగ్రహ విగ్రహ ప్రతిష్టాచార్యులు సీతారాం శర్మ, గడియారం బాలాజీ శర్మ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్టాపన నిర్వహించారు. సోమవారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ శ్రీదేవి, పడకంటి శ్రీనివాస్, కేశెట్టి వంశీకృష్ణ, నకిరే కొమ్ముల రాజేంద్రప్రసాద్, సిరిపురం రాజేష్, ముక్త శ్రీనివాస్, కటకం హరీష్, మాదంశెట్టి సత్యనారాయణ, చిలువేరు వైకుంఠం, చిలువేరు శ్రీనివాస్, రాచర్ల చంద్రశేఖర్, పుల్లూరి బాలమోహన్, కొంకుముట్టి వెంకటేశ్వర్లుతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.